ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0
**



సూర్యాపేట

3

గురువారం 18 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.60 (122.68)	19,274	5,598
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	638.20 (2.82)	నిల్	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	99.44 (0.71)	47	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.210



తరలివస్తోన్న కృష్ణమ్మ

ఇన్నాళ్లు చెమ్మగిల్లిన రైతు కళ్లలో ఆనందం వెల్లివిరిస్తోంది. కృష్ణానది ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీటి రాక మొదలవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారైనా పంటలు సమృద్ధిగా పండి, కష్టాలు తీరుతాయన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. ఎగువన శ్రీశైలానికి వరద తాకిడి ఆరంభం కావడంతో విద్యుదుత్పత్తి చేస్తూ 22,157 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

- ఆల్మట్టికి వరదపోటు ● జూరాలకు ఇన్‌ఫ్లో మొదలు
- శ్రీశైలంలో విద్యుదుత్పాదనతో సాగర్‌కు నీటివిడుదల
- ఇదేస్థాయి వరద కొనసాగితే మంగళవారానికి సాగర్‌కు వరదపోటు ● ఆయకట్టులో చిగురిస్తోన్న ఆశలు

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

కృష్ణాబేసిన్ ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, తుంగభద్ర నదులకు వరద వస్తోంది. ఆల్మట్టి, నారాయణ పూర్, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి దిగువకు నీరొస్తుండడంతో జూరాల, శ్రీశైలానికి వరద తాకిడి మొదలయింది. జూరాలకు వరద భారీగా వస్తుండడంతో ఇప్పటికే విద్యుదుత్పత్తి ద్వారా నీరు వదులుతుండగా, రాత్రికి క్రస్ట్‌గేట్లు ఎత్తేందుకు ఏర్పాట్లుచేశారు. మరోవైపున తుంగభద్ర నుంచి శ్రీశైలానికి కూడా వరద వస్తుండడం, మరోవైపు శుక్రవారానికి జూరాల వరద వచ్చి చేరనున్నట్లు అంచనా వేస్తున్నారు. కేఆర్‌ఎంబీ (కృష్ణానదీ యాజమాన్య బోర్డు) ఆదేశాల మేరకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుదుత్పత్తి సాగిస్తూ 22,157 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి వరదలు ఇలాగే కొనసాగితే నాగార్జునసాగర్‌కు మంగళవారం నాటికి వరద జలాల తాకిడి ఉండవచ్చని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. సాగర్ ఆయకట్టుకు వరుసగా గత వానాకాలం, యాసంగి సీజన్లలో క్రాప్ హాలిడే ప్రకటించడం, ఈసీజన్‌లో ఇప్పటివరకు సరైన వరదలేకపోవడంతో ఈసారి కూడా ఆయకట్టు సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొన్న సందర్భంలో తాజా వరద తాకిడితో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

● నాగార్జునసాగర్‌కు 19,274 క్యూసెక్కుల వరద

నాగార్జునసాగర్‌కు ఈ సీజన్‌లో బుధవారమే అత్యధికంగా 19,274 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు రెండు విద్యుత్‌కేంద్రాల నుంచి విద్యుదుత్పత్తి కొనసాగిస్తూ, ఏపీకి 4.500 టీఎంసీలు, తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని కేఆర్‌ఎంబీ (కృష్ణానదీజలాల యాజమాన్యబోర్డు)ఆదేశించడంతో ఆ మేరకు బుధవారం విద్యుదుత్పాదన మొదలయింది. తద్వారా శ్రీశైలం కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 15,800 క్యూసెక్కుల నీటిని,ఎడమగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 6,357 క్యూసెక్కుల నీటిని కలిపి మొత్తం 22,157 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణాకు (నాగార్జునసాగర్‌కు) విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌నుంచి కుడికాల్వకు 5,598 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ వరదను పరిశీలిస్తే, ఆల్మట్టికి ఎగువనుంచి 81,333 క్యూసెక్కుల నీరు వస్తుండగా, దిగువకు క్రస్ట్‌గేట్లు, పవర్‌హౌస్ ద్వారా 65వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆలమట్టి దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయానికి 55వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 12గేట్ల ద్వారా దిగువ కృష్ణానదికి 37,260 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జూరాలకు బుధవారం రాత్రికి దాదాపు 30వేల క్యూసెక్కుల వరద వస్తుందనే అంచనాతో గేట్లు ఎత్తేందుకు ఇరిగేషన్ అధికారులు సన్నద్ధమయ్యారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రస్తుతానికి వరదతాకిడి లేకపోయినా, జూరాల నుంచి విద్యుదుత్పత్తి మొదలవడంతోపాటు, క్రస్ట్‌గేట్లు ఎత్తితే ఆ మేరకు శుక్రవారానికి వరద వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ వరదలు ఇలాగే కొనసాగితే మంగళవారం నాటికి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో నమోదవుతుందని అధికారులు అంచనాతో ఉన్నారు.

రిజర్వాయర్	నీటినిల్వ సామర్థ్యం	ప్రస్తుత నీటినిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	(టీఎంసీలలో)		(క్యూసెక్కులలో)	
ఆల్మట్టి	129.72	99.32	81,333	65,000
నారాయణపూర్	37.64	30.70	55,000	37,260
ఉజ్జయినీ	117.24	47.04	15,442	నిల్
జూరాల	9.66	7.66	2500	7500
తుంగభద్ర	105.79	39.72	49,522	409
శ్రీశైలం	215.81	33.25	3,585	30,912
నాగార్జునసాగర్	312.05	122.68	19,274	5598

తొలిఏకాదశి పూజలు



సూర్యాపేటలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

జిల్లావ్యాప్తంగా తొలిఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాలను నిర్వాహకులు పూలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అర్చనల్లో పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు. మఠంపల్లి వద్ద కృష్ణానదిలో భక్తులు తెల్లవారుజామున నదీస్నానమాచరించారు. విష్ణుమూర్తి నిద్రావస్థకు చేరుతుండగా వచ్చే ఏకాదశిని తొలిఏకాదశిగా జరుపుకుంటారని పూజారులు వివరించారు. పలువురు భక్తులు సాయంత్రం వరకు ఉపవాస దీక్ష ఉండి సాయంత్రం విరమించారు. పూజారులు రాత్రి వేళ ఆలయాల్లో ప్రత్యేక భజన కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు.

6

ఘనంగా పీర్లపండుగ



అర్వపల్లి మండలం రామన్నగూడెంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

త్యాగనిరతిని గుర్తు చేసుకునే పీర్ల పండుగను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగలో హిందూ, ముస్లింలు పాల్గొన్నారు. గ్రామాల్లోని పీర్లచావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం పీర్లను గ్రామవీధుల్లో ఊరేగించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అలావుల చుట్టూ దూలా ఆడారు. భక్తులు దట్టీలు సమర్పించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం పీర్లను నిమజ్జనం చేశారు.

6

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక

సూర్యాపేట అర్బన్, జూలై 17: ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే షరతులు పెట్టడం సరికాదన్నారు. రైతుల రూ.2లక్షల రుణమాఫీని అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు మారసాని చంద్రకళ, సూరం రేణుక, గులాం, వాజిద్, ఎల్లయ్య, సురేష్, మహేష్, జయమ్మ, జానయ్య, బాజీ, పద్మ, భవాని పాల్గొన్నారు.

గరిడేపల్లి: రైతురుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకోకుండా రైతు పాస్‌పుస్తకం ఆధారంగా చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండలసమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటే అర్హులైన చిన్న, సన్నకారు రైతులు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్వపల్లి: కొర్రీలు పెట్టకుండా ఏకకాలంలో రైతుల రూ.2లక్షల రుణమాఫీ ప్రభుత్వం చేయాలని మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. అర్వపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ విషయంలో మోసం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు కడారి నరేష్, భైరబోయిన పెద్దయ్య, మామిడాల రాజలింగం, అరిగె నాగరాజు, భైరబోయిన వెంకన్న, దావుల లింగయ్య, కొమారి నాగరాజు, అంకిరెడ్డి వెంకన్న, రవీందర్‌నాయక్, దావుల నాగరాజు, ప్రసాద్, ఆకారపు శ్రీను, అంకిరెడ్డి సందీప్, సాయి పాల్గొన్నారు.

నేడు ప్రతిష్ఠామూర్తుల ఊరేగింపు



తమిళనాడు రాష్ట్రం కుంభకోణం నుంచి తీసుకువచ్చిన దేవతామూర్తుల విగ్రహాలు

నేరేడుచర్ల, జూలై 17: నేరేడుచర్లలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతిష్ఠించే అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యం, మాలికాపురతమ్మ అమ్మవార్ల విగ్రహాలను నేడు పట్టణంలో ఊరేగిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొణతం కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయం పూర్తయ్యిందన్నారు. దేవతామూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆగస్టు 17, 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నామని, ఆలయంలో ప్రతిష్ఠించే దేవతామూర్తుల విగ్రహాలు తమిళనాడు రాష్ట్రం కుంభకోణం నుంచి వచ్చాయని, ఆ విగ్రహాలతో గురువారం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు దేవాలయం ప్రాంగణం నుంచి ఊరేగింపు ప్రారంభం అవుతుందన్నారు. భక్తులు, పురప్రముఖులు పెద్దఎత్తున హాజరై ఊరేగింపులో పాల్గొనాలన్నారు. ధ్వజస్తంభం కృష్ణశిలతో తయారు చేయిస్తున్నామని, ఆ పనులు కూడా పూర్తికావచ్చాయన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు చిన్నపల్లి శ్రీనివాస్, ఐల శ్రీనివాస్, చిట్యాల శ్రీను, ఒంటెద్దు ప్రభాకర్‌రెడ్డి, మన్నెం దుర్గారావు, యారవ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొలివిడత రుణమాఫీ

- రూ.2 లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ
- మొదటగా రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు..
- జిల్లాలో 56,217 మందికి వర్తింపు
- 56,084 కుటుంబాలకు లబ్ధి

సూర్యాపేట సిటీ, జూలై 17 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రధాన హామీల్లో ఒకటైన రూ.2లక్షల రైతు రుణమాఫీ కార్యాచరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ నేడు రుణమాఫీ వర్తింపజేయనున్నారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 13వ తేదీలోపు రైతులు పట్టాదార్‌పాస్‌పుస్తకాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. వారందరికీ రుణమాఫీ వర్తింపచేస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటికే అర్హుల జాబితాను అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల జాబితాను ఇప్పటికే ఆయా బాంకర్లు రాష్ట్ర ప్రభుత్వానికి గత నెలలో అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారులు అందజేసిన సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా 56,217 మంది రైతులు రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నారు. వీరందరికీ రుణమాఫీ వర్తించనుంది. సూర్యాపేట నియోజవర్గంలో 11, 623 మంది, తుంగతుర్తి నియోజవర్గంలో 11, 209 మంది, కోదాడ నియోజవర్గంలో 16, 864 మంది, హుజూర్‌నగర్ నియోజవర్గంలో 16, 521 మంది రైతులు ఆయా బ్యాంకులలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. 56,084 కుటుంబాలకు చెందిన 56,217 మంది రైతులకు మొదటి విడతలో రుణమాఫీ కానుంది. ఇదిలా ఉండగా రూ.లక్షలోపు రుణాల సొమ్మును గురువారం సాయంత్రం వరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతుల అప్పులను ప్రభుత్వమే ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తుండటంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతగా రూ.లక్ష లోపు ఉన్న రైతులకు రుణమాఫీని వర్తింప చేస్తూ ఆగస్టు 15లోపు రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టదారు పాస్‌పుస్తకం కలిగిన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతాలోపంతో కాల్వ లైనింగ్ పనులు



నోటికి నల్లరిబ్బన్లు ధరించి, మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న నాయకులు

హుజూర్‌నగర్, జూలై 17: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కాల్వ నిర్మాణ పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు, ఓయూజేఏసీ నాయకులు సోమగాని నరేందర్‌గౌడ్, ప్రజాకళాకారుడు బాదె నర్సయ్య ఆరోపించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని, ప్లకార్డులతో చేతబూని మోకాళ్లపై కూర్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ కాంట్రాక్టర్లు ఎంబీ కాల్వల పనులను నాసిరకంగా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నెస్పీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదన్నారు. నాణ్యత లేకుండా పనులు చేయడంతో కొద్ది కాలానికే కాల్వ లైనింగ్ పనులు దెబ్బతింటున్నాయన్నారు.కార్యక్రమంలో లింగం కృష్ణ, రేఖ సైదులు, సోమగాని నాగేశ్వరరావు, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ప్రకటించడం హర్షణీయం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు

సూర్యాపేటటౌన్ / కోదాడ, జూలై 17: ఆర్ఎంపీలు, పీఎంపీలకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్ఎంపీలు, పీఎంపీల కృషి వెలకట్టలేనిదన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు పోలిశెట్టి రాజేందర్, ఎస్కే రహమతుల్లా, డాంగ్దేగౌడ్, జెర్రిపోతుల లక్ష్మణ్, గోకంటి రాజాబాబురెడ్డి, కుమ్మరి వెంకన్న, నాగుల్‌మీరా, నాగరాజు, లక్ష్మణ్‌నాయుడు, మరికంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. కోదాడలో ఆచార్య జయశంకర్ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాధాచార్యులు మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న రోగాలకు వైద్యం అందించటంలో ఆర్ఎంపీలది, పీఎంపీలది కీలక పాత్ర అన్నారు. శిక్షణ, సర్టిఫికెట్‌తో పాటు పారితోషికం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కోరారు.

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, జూలై 17 : జిల్లాను పర్యాటకరంగ కేంద్రంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఆరెగూడెం, దాస్‌తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి, మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. సూర్యాపేట పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ఇంజనీర్లతో ప్రణాళిక రూపొందించామని, సుమారు రూ.61 కోట్ల బడ్జెట్ అంచనాతో వేయడం జరిగిందన్నారు. పిల్లలమర్రి, ఉండ్రుగొండ వంటి పురాతన దేవాలయాలను, మూసీ ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సూర్యాపేటలో మూడు సెల్ఫీపాయింట్లు ఏర్పాటు చేయడానికి ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఉద్యోగాల నోటిఫికేషన్లు వేశామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తోందన్నారు. బీఆర్ఎస్ మునిగిపోయే పడవని, కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే కుంగిపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగానే చేరికలు జరుగుతున్నాయని, ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, ధరావత్ వెంకన్ననాయక్, పూర రాంమూర్తియాదవ్, పులగం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు షఫిఉల్లా, వెలుగు వెంకన్న, స్వామినాయుడు, వల్దాస్ దేవేందర్, వేణారెడ్డి, ఫరూఖ్, జ్యోతికరుణాకర్, నిమ్మల వెంకన్న, రమేష్‌నాయుడు, ధర్మానాయక్, తండు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, యాట వెంకన్న, భైరబోయిన శ్రీనివాస్, నేరెళ్ల మధుగౌడ్, జానయ్య, పాలడుగు పరుశురాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారంలో విషాదం
- క్వారీ గుంతలో మునిగి ముగ్గురు మృతి
- మృతుల్లో తండ్రీకుమార్తె, మరొకరు



బొప్పారం సమీపంలోని క్వారీలోని నీటి గుంత



మృతి చెందిన రాజు, శ్రీపాల్‌రెడ్డి(ఫైల్)

ఆత్మకూర్(ఎస్), జూలై 17 : స్నేహితుడు పిలిచాడని వచ్చిన వ్యక్తి, ఇంటికి వచ్చిన ఆ స్నేహితుడికి ఊరంతా చూపించాలన్న తపన, వారి కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. పల్లె ప్రకృతి అందాలను తిలకిస్తూనే గ్రామ సమీపంలోని క్వారీలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఐదుగురిలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామంలో విషాదం నెలకొంది. మృతుల్లో తండ్రీ కుమార్తెలు ఉండటం అందరినీ కలిచివేసింది. సరదా కోసం బయటకు వెళ్లిన వాళ్లు మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అత్తగారి గ్రామమైన బొప్పారానికి శ్రీపాల్‌రెడ్డి దంపతులతో పాటు స్నేహితుడు ఏపీకి చెందిన చామల రాజు, అతడి కుటుంబ సభ్యులు వచ్చారు. గ్రామంలో శుభకార్యం ముగిశాక పల్లె అందాలు తిలకించేందుకు వెళ్లి గ్రామ సమీపంలోని క్వారీలో ఈత కోసం వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు శ్రీపాల్‌రెడ్డితో పాటు చామల రాజు, అతడి కుమార్తె ఉషాంక మృత్యువాత పడ్డారు. శ్రీపాల్‌రెడ్డి కుమారుడు చేతన్‌రెడ్డి, రాజు కుమార్తె రిషిక ప్రమాదం నుంచి బయటపడ్డారు.

- వివరాలు 5లో

అంతరిస్తున్న కళలను ఆదరించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బొమ్మిడి లక్ష్మీనారాయణ

సూర్యాపేట అర్బన్, జూలై 17 : రోజురోజుకూ అంతరిస్తున్న పురాతన కళలను ఆదరించాలని కిరాణ ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కిరాణ ఫ్యాన్సీ మర్చంట్ భవనంలో విజయభాను కళాసమితి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. ఇప్పటికే అనేక పురాతన కళలు, సంస్కృతులు అంతరించిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం కళాకారుల ప్రదర్శన పలువురిని అలరించాయి. కార్యక్రమంలో విజయభాను కళాసమితి అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్యగౌడ్, పుల్లభట్ల లక్ష్మీనారాయణశర్మ, నందిగామ సీతారామశాస్త్రి, జీ సాయిలు, పేరాల సుధీర్, పుల్లభట్ల కృష్ణమూర్తిశర్మ, ధనియాకుల వెంకటేశ్వర్లు, కల్లూరి నాగయ్య, ధనియాకుల సత్యనారాయణ, చల్లా సత్యనారాయణరెడ్డి, నందిగామ భార్గవ్‌కృష్ణ, దాసరి సత్యం, నందిగామ అరవిందశర్మ పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


స్వామివారికి లక్షపుష్పార్చన చేస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమ రీతిలో గంటపాటు పూజా పర్వం కొనసాగింది. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో శాస్త్రోక్తంగా అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సాయంత్రం వేళ ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామడపంలో స్ఫటికమూర్తులకు శైవాగమ పద్ధతిలో పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,18,292 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. తొలిఏకాదశిని పురస్కరించుకుని సాంస్కృతిక కళామండలి అధ్యక్షుడు రామనర్సయ్య కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తి చాటుకున్నారు. స్వామిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని దర్శించుకున్నారు.

మర మగ్గాల మొర

వినరూ..

● వస్త్ర నిల్వలు పేరుకుపోవడంతో మగ్గాలు బంద్ పెడుతున్న మాస్టర్ వీవర్స్ ● ఉపాధి కరువై దిక్కుతోచని స్థితిలో చేనేత కార్మికులు ● పని కల్పించలేని స్థితిలో చేనేత సంఘాలు





చేనేత రంగం పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన టెస్కో(తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ) ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. దీనికి తోడు చేనేతకు రిజర్వు చేసిన వస్త్రాలను సైతం పవర్‌లూం మిల్లులు దర్జాగా కాపీ చేస్తుండడంతో చేనేత వైభవం కళాహీనమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 7,917 మగ్గాలకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు జియో ట్యాగింగ్ చేశారు. జియో ట్యాగింగ్ కాని మగ్గాలు అనేకంగా ఉన్నాయి. నేడు సహకార, సహకారేతర రంగంలోని చేనేత కార్మికులకు ఉపాధి కరువైంది. సంఘాలు అచేతనంగా మారడంతోపాటు సహకారేతర రంగంలోని ప్రైవేట్ మాస్టర్ వీవర్స్ సైతం వస్త్ర నిల్వలు పేరుకుపోవడంతో కార్మికులకు పని కల్పించలేని స్థితిలో మగ్గాలు మూసేస్తున్నారు.

● భూదాన్‌పోచంపల్లి.

చేనేత రంగాన్ని ఆదుకోవడంలో గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. బతుకమ్మ చీరలు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలకు చేనేత వస్త్రాలను వినియోగించి చేతులు దులుపుకుందే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు. చేనేత సంఘాల్లో కోట్లాది రూపాయల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. బహిరంగ మార్కెట్లోనూ వస్త్ర తయారీదారులు మాస్టర్ వీవర్లు సైతం చీరలు నేయించే స్థితిలో లేరు. అదనంగా మగ్గాలు నేయించలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో వస్త్రాలకు డిమాండ్ లేకుండా పోయింది. దీంతో కార్మికులకు పనిలేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు.

టెస్కో కొనుగోళ్లు లేక చేనేత సహకార సంఘాలు నిస్తేజం

చేనేత సహకార సంఘాల్లోని వస్త్రాలను ప్రభుత్వం ఖరీదు చేయకపోవడంతో సంఘాలు కార్మికులకు ఉపాధి కల్పించలేని స్థితిలోకి వెళ్లాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పడిన తొలి చేనేత సహకార సంఘం కొయ్యలగూడెం చేనేత సంఘం పరిధిలో మొత్తం 594మంది పని చేస్తున్నారు. వీరు నేసిన రూ.కోటి 30లక్షల విలువైన చేనేత వస్త్రాలు సంఘంలోనే పేరుకుపోయాయి. కార్మికులు నేసిన వస్త్రాలను టెస్కో కొనుగోలు చేయాల్సి ఉంది. గతేడాది జూలై నెలలో టెస్కో కేవలం రూ.40లక్షల చేనేత వస్త్రాలను మాత్రమే కొనుగోలు చేసింది. రూ.40లక్షల్లోనూ బకాయిపడిన రూ.18లక్షలు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బాకీ చెల్లించింది. అప్పటి నుంచి కొనుగోలు చేయకపోవడంతో రూ. కోటికి పైగా వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. 594మంది ఉన్న చేనేత సహకార సంఘంలో ఇప్పుడు కేవలం 100మంది మాత్రమే పని చేస్తున్నారు. కొందరు ప్రైవేట్‌గా చేనేత పనిచేస్తుండగా, మరికొందరు ఇతర వృత్తుల్లోకి వెళ్తున్నారు.





పర్సన్ ఇన్‌చార్జిల పాలనతో సంఘాలు అస్తవ్యస్తం

తెలంగాణలోనే అత్యంత పేరెన్నిక గన్న పెద్ద సంఘం పోచంపల్లి చేనేత సహకార సంఘం. ఇందులో మొత్తం 911మంది సభ్యులుండగా కేవలం సగానికి పైగా కార్మికులు రెండేళ్ల క్రితం పనిచేసేవారు. ఇప్పుడు కేవలం 180 మంది మాత్రమే మగ్గం నేస్తున్నారు. చేనేత సంఘాలకు కొన్నేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్సన్ ఇన్‌చార్జిల పాలనతో సంఘాలు కార్మికులకు పనికల్పించలేని స్థితిలో ఉన్నాయి. కేవలం 100లోపు మాత్రమే కార్మికులకు నూలు అందిస్తున్నారు. సంఘాలపై పర్సన్ ఇన్‌చార్జీలకుగా అధికారులు కావడంతో వారిపై అజమాయిషీ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పోచంపల్లి చేనేత సహకార సంఘంలోని సిబ్బంది, అధికారుల నిర్వాకంతో వందల చీరలు మాయమైనట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గం లేకపోవడంతో సంఘాలన్నీ మూతపడే స్థితికి చేరుకున్నాయి. భువనగిరియాదాద్రి జిల్లాలో 89, నల్లగొండ జిల్లాలో 44, సూర్యాపేట జిల్లాలో పది వరకు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు పెండింగ్‌లో ఉన్న రూ.5 కోట్ల మేరకు మంజూరు కాగా, ఆ డబ్బులు కొన్ని సొసైటీలకు అందాయి. మరికొన్ని సొసైటీలకు ఇప్పటికీ చెల్లించలేదు.

పేరుకుపోయిన వస్త్రాలు కొనుగోలు చేయాలి



ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల్లో కోట్లాది రూపాయల వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. గతంలో టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాల డబ్బులు వెంటనే చెల్లించాల్సిన అవసరముంది. సంఘాల్లో ఇన్‌చార్జిల పాలనతో సంఘాలు కార్మికులకు పని కల్పించలేకపోతున్నారు. అటు సహకార, ఇటు సహకా రేతర రంగాల్లోని కార్మికులకు ఉపాధి కరువైంది. మార్కెట్లో చేనేత వస్త్రాలకు గిరాకీ లేక కార్మికులకు పని కల్పించే స్థితిలో ప్రైవేట్ రంగంలోని మాస్టర్ వీవర్లు లేరు. ఇప్పటికే కొందరు మగ్గాలు బంద్ చేశారు. వస్త్ర నిల్వలు పేరుకుపోవడంతోపాటు వ్యాపారులకు ఇచ్చిన చీరలకు డబ్బులు చెల్లించకపోవడంతో మాస్టర్ వీవర్స్ చేతులెత్తేస్తున్నారు.

● అంకం మురళి, భూదాన్‌పోచంపల్లి చేనేత సంఘం నాయకుడు

మంత్రి తుమ్మలకు చేనేత సహకార సంఘాల నాయకుల వినతి

చేనేత సహకార సంఘాలను ప్రభుత్వం ఆదుకోవాలని జూన్ 6న చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చేనేత సహకార సంఘాల నాయకులు భారత వాసుదేవ్, పిల్లలమర్రి శ్రీనివాస్, గడ్డం జయశంకర్ కలిసి, సమస్యలను విన్నవించారు. సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను వెంటనే కొనుగోలు చేయాలని, పెండింగ్ టెస్కో బిల్లులను, పావలా వడ్డీ రుణాలు చెల్లించాలని, త్రిఫ్టు పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. 'నేతన్న భరోసా' కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేస్తేనే చేనేత రంగం జవజీవాలు పుంజుకునే వీలుందని పేర్కొన్నారు. చేనేత సంఘాలను ఆదుకుంటేనే అవి బలోపేతమై కార్మికులకు ఉపాధి కల్పించే వీలుందని చేనేత మంత్రికి నివేదించారు.

ఒకప్పుడు చేతి నిండా పని..



పవర్‌లూమ్స్, హ్యాండ్లూమ్ మధ్య తీవ్ర పోటీ ఉండేది. ఇప్పుడు రెండూ సంక్షోభంలోనే ఉన్నా యి. నూలు ధరలు పెరిగిపోవడంతో మాస్టర్ వీవర్స్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇక్కడ తయారయ్యే పట్టు వస్త్రాలతోపాటు పంచెలు, టవల్స్, లుంగీలు వంటి రకాలు అన్నీ తమిళ నాడు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో పవర్‌లూం పరిశ్రమలు మూత పడే స్థితికి చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో నల్ల గొండ, చర్లపల్లి, కట్టంగూరు, నకిరేకల్, చిట్యాల, నేరడ, బ్రాహ్మణవెల్లెంల, నార్కట్‌పల్లి, రామన్న పేట, ఎల్లంకి, సిరిపురం, రాజాపేట, బచ్చన్న పేట, రఘునాథపురం, ఆలేరు, నెమిల, కొలను పాక, టంగుటూరు, కందుకూరు తదితర గ్రామాల్లో చేనేత కార్మికులు పవర్‌లూం పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చట్టప్రకారం పవర్‌లూమ్స్‌పై 21రకాల వస్త్రాలు మాత్రమే తయారు చేయాలి. అందులోనూ తెల్లని వస్త్రం మాత్రమే తయారు చేయాలి. కానీ, పోచంపల్లి పట్టు చీరల డిజైన్లను కాపీ చేసి పవర్‌లూంపై తయారు చేసి తక్కువ ధరలకు అమ్ముతున్నారు. చేనేత మగ్గం కార్మికులు పవర్ లూంతో పోటీ పడలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం నూలుపై 12శాతం, రసాయనాలపై 18 శాతం జీఎస్టీ విధిస్తుండడంతో క్లాత్‌కు ఎక్కు వ రేటు పెట్టాల్సి వస్తోంది. ధరలు పెంచితే కొనుగోలు చేసేందుకు వినియో గదారులు ముందుకు రావడంలేదు. చేనేత పరిశ్రమ సైతం దయనీయ పరిస్థితిలో ఉంది. ఉమ్మడి జిల్లాలోని పోచంపల్లి, సంస్థాన్‌నారాయణపురం, చండూరు, మునుగోడు, చౌటుప్పల్, గట్టుపల్, కొయ్యలగూడెం, పుట్టపాక తదితర ప్రాంతాల్లోని కార్మికులకు ఒకప్పుడు చేతినిండా పని దొరికేది. బహిరంగ మార్కెట్లోనూ పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్‌కు మంచి పేరు రావడంతో ఈ ప్రాంతాల్లోని చేనేత మగ్గం కార్మికుల కడుపులు నింపేవి. ఆ తర్వాత కార్మికుల జీవితాలు తలకిందులయ్యాయి.

పండుగ పూట విషాదం

వేర్వేరు చోట్ల నీటమునిగి నలుగురు మృతి

● క్వారీ గుంతలో మునిగి సూర్యాపేట జిల్లాలో ముగ్గురు మృత్యువాత
● తొలి ఏకాదశి పుణ్యస్నానానికి వెళ్లి నల్లగొండ జిల్లాలో మరొకరు మృతి





మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, ముగ్గురు మృతిచెందిన బొప్పారం క్వారీ ప్రదేశం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు చోట్ల బుధవారం నీటిలో మునిగి నలుగురు మృత్యువాత పడ్డారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామం లో పల్లె ప్రకృతి అందాలను తిలకిస్తూ, ఈత సరదాతో క్వారీలోని నీటిగుంతలో దిగి ముగ్గురు, నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ వద్ద తొలి ఏకాదశి పుణ్యస్నానానికి వెళ్లి మరొకరు కృష్ణానదిలో మునిగి మృత్యువాత పడ్డారు.

ఆత్మకూర్(ఎస్) జూలై 17: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన శ్రీపాల్‌రెడ్డి(44), అతడి స్నేహితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నరసరావుపేటకు చెందిన చామల రాజు(45), ఆయన కుటుంబంతో కలిసి శ్రీపాల్‌రెడ్డి అత్తగారి గ్రామం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామానికి రెండు రోజుల కిందట తొలిఏకాదశి పండుగ కోసం వచ్చారు. మంగళవారం మండలంలోని నెమ్మికల్ గ్రామంలోని దండు మైసమ్మ దేవాలయం వద్ద బంధువుల శుభకార్యానికి హాజరై బొప్పారం గ్రామానికి వచ్చారు. బుధవారం ఉదయం బొప్పారం గ్రామ అందాలను చూద్దామని శ్రీపాల్‌రెడ్డి అతడి పెద్దకుమారుడు చేతన్‌రెడ్డితో పాటు చామల రాజు, ఇద్దరు కుమార్తెలు ఉషాంక(12), రిషిక, శ్రీపాల్‌రెడ్డి వదిన కుమార్తె వర్షిత, మొత్తం ఆరుగురు గ్రామ సమీపంలోని బిక్కేరు వాగు వద్దకు వెళ్లి కొంతసమయం అక్కడే సేదతీరారు. అక్కడినుంచి శ్రీపాల్‌రెడ్డి మామ ఉపేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి వస్తూ చెరువుకు సమీపంలోని క్వారీలో ఉన్న నీటిని చూసి ఈత కొట్టాలని సరదా పడ్డారు. క్వారీ గుంత లోతు తక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈత కొట్టేందుకు అక్కడికి వెళ్లారు. శ్రీపాల్ రెడ్డి పెద్ద కుమారుడు చేతన్‌రెడ్డికి ఈత వస్తుందని తెలిసి క్వారీ గుంతలోకి దిగి, గుంత లోతు చూసి రమ్మన్నారు. గుంత లోతుగా ఉందని చెప్పేలోగా రాజు, అతని పెద్ద కుమార్తె ఉషాంక నీటిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలోకి జారి పడ్డారు. వారిని కాపాడే ప్రయత్నంలో శ్రీపాల్‌రెడ్డి నీటి దగ్గరికి వెళ్లి కాలుజారి నీటిలో పడ్డాడు. అదే సమయంలో రాజు చిన్నకుమార్తె రిషిక కూడా నీటిలోకి జారిపడింది. రిషికను చేతన్‌రెడ్డి బయటకు తీసుకువచ్చాడు. ఈలోగా రాజు, ఉషాంక, శ్రీపాల్‌రెడ్డి నీటిలో మునిగిపోయారు. బయట ఉన్న మృతుడు రాజు చిన్న కుమార్తె శ్రీపాల్‌రెడ్డి బంధువులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చి, కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకున్నారు. ఈత రాకపోవడంతో అప్పటికే శ్రీపాల్‌రెడ్డి, రాజు, ఉషాంక నీటిలో మునిగి మృతి చెందారు.

బిల్డర్‌గా పనిచేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

శ్రీపాల్‌రెడ్డి ఖమ్మంలో కొంతకాలంగా బిల్డర్‌గా పనిచేస్తున్నాడు. చామల రాజు కొంతకాలంగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రాజు భార్య, శ్రీపాల్‌రెడ్డి భార్య స్నేహితులు కావడంతో రెండు కుటుంబాలు సన్నిహితంగా ఉంటున్నాయి. గుంతలో పడి మృతిచెందిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ రవి, సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు.

క్వారీ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి : గ్రామస్థులు

అనుమతి లేకుండా క్వారీ నిర్వహిస్తుండటంతో చుట్టుపక్కల పంట పొలాలు దెబ్బ తింటున్నాయని, క్వారీలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని, దీంతో పలుమార్లు నీటికోసం వెళ్లిన మూగజీవులు మృత్యువాతపడ్డ దాఖలాలు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. మూగ జీవాలతో పాటుగా తాజాగా ముగ్గురు చనిపోవడంతో గ్రామస్థులు క్వారీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా క్వారీ నిర్వహిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పుణ్యస్నానానికి కృష్ణానదిలో దిగి...

చందంపేట: పుణ్యస్నానానికి కృష్ణానదిలో దిగిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్, మృతుడి స్నేహితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం మక్తా గ్రామానికి చెందిన చింతపంటి జగదీష్(42) ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో విహారయాత్రతో పాటు తొలిఏకాదశి పుణ్యస్నానాల కోసం నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీకి మంగళవారం సాయంత్రం చేరుకున్నారు. బుధవారం తొలి ఏకాదశి కావడంతో తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో పుణ్యస్నానాలు చేద్దామని నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్ కృష్ణానదిలోకి వెళ్లాడు. ఈత రాకపోవడంతో గమనించకుండా ముందుకు వెళ్లిన జగదీష్ నీట మునిగాడు. నీటిలోకి వెళ్లిన జగదీష్ కనిపించకపోవడంతో స్నేహితులు కేకలు వేస్తూ స్థానికులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మత్స్యకారుల సహకారంతో గాలింపు చేపట్టారు. రెండు గంటల అనంతరం ఆరు గంటల సమయంలో జగదీష్ మృతదేహం నీటిపైకి తేలింది. స్థానికులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జగదీష్ తల్లిదండ్రులు, బంధువులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారు స్వగ్రామానికి తీసుకెళ్లారు. విహారయాత్రకు వచ్చి పండగపూట కృష్ణానదిలో నీటమునిగి జగదీష్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు విలపించారు. జగదీష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అత్తమామల నుంచి రక్షణ కల్పించాలి



ఐద్వా ప్రతినిధులతో కలిసి నిరసన తెలుపుతున్న మంజుల

తిప్పర్తి, జూలై 17: అత్త, మామల నుంచి తనకు రక్షణ కల్పించి తన ఇంట్లో హక్కు కల్పించాలని వివాహిత నిరసనకు దిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామంలో బుధవారం జరిగింది. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన దారమళ్ళ మరియమ్మ, వెంకులు దంపతుల కుమారుడు సవేందర్‌కు మాడ్గులపల్లి మండల పరిధిలోని కుక్కడం గ్రామానికి చెందిన మంజులతో 2017లో వివాహం జరిగింది. సవేందర్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. 2021లో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తూ గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో సవేందర్ భార్య మంజుల తన తల్లిగారి గ్రామమైన కుక్కడం గ్రామానికి వెళ్లిపోయింది. మంజులకు అత్త, మామలు న్యాయం చేయాలని అప్పుడు గ్రామ పెద్ద మనుషులు నిర్ణయించారు. రెండు సంవత్సరాలుగా కోడలు మంజులకు ఏదో ఒక రకంగా న్యాయం చేస్తామని చెప్పిన అత్త, మామ తర్వాత ఆస్తిలో వాటా లేదని, తమతో సంబంధం లేదని చెప్పారు. మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. భర్త మృతితో ఒంటరి అయిన మంజుల మంగళవారం మహిళా సంఘాలను ఆశ్రయించింది. మూడు రోజులుగా తన ఇంటి ఆవరణలోనే నిరసనకు దిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ భర్తలేని ఒంటరి మహిళకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

మహిళ మెడనుంచి గొలుసు అపహరణ

చిలుకూరు, జూలై 17: మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించిన సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేతవోలు గ్రామ శివారులో గ్రామానికి చెందిన ముత్తయ్య వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ పొలంలో ముత్తయ్య తన భార్య చంద్రమ్మ, కూతురు ఉమలతో కలిసి పనిచేస్తున్నారు. ఈ సమయంలో కడారి చంద్రమ్మ వద్దకు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మాట్లాడారు. రైతు వివరాలు అడుగుతున్నట్లుగా నటిస్తూ చంద్రమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసు లాగారు. దీంతో చంద్రమ్మ గొలుసును గట్టిగా పట్టుకుని అరవడంతో సగం తెగిన తులం బంగారంతో కూడిన గొలుసు తీసుకుని దొంగలు పోలేనిగూడెం రోడ్డు వైపునకు పారిపోయారు. బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, చిలుకూరు ఎస్ఐ సురభి రాంబాబులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి వద్ద వివరాలు సేకరించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

120 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చివ్వెంల, జూలై 17: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని వాల్యాతండా వద్ద 120 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం... చివ్వెంల మండలం వాల్యాతండాకు చెందిన బానోతు హరిప్రసాద్ అతని బంధువు బీబీనగర్‌కు సమీపంలోని జంపల్లి గ్రామానికి చెందిన దేవతోతు లింగ, వాల్యాతండాకు చెందిన దరావత్ కృష్ణ ముగ్గురు కలిసి చివ్వెంల సమీప తండాల లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన 120బస్తాల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలించేందుకు డీసీఎంలో లోడ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాల్యాతండా సమీపంలో పోలీసులు డీసీఎంతో పాటు రేషన్ బియ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. డీసీఎంను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయని సమాచారంతో..

పెద్దవూర: ఇంట్లో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తుంగతుర్తి గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి గ్రామానికి చెందిన ఈసరం ఏడుకొండలు, వంగూరి నరేందర్, ఈసరం ఈదయ్య, దుగ్యాల సైదులు, వెంకటకృష్ణతోపాటు మరికొందరు కలిసి రేషన్ బియ్యాన్ని అదే గ్రామానికి చెందిన తెలకపల్లి సాంబశివ ఇం ట్లో నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంటిపై దాడి చేసి సుమా రు ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నింది తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని విక్రయించినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తుంగతుర్తి, జూలై 17: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని సంగెం గ్రామంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన ఏసమల్ల జయమ్మ(54) బుధవారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న సంపు వద్ద విద్యుత్ మోటార్ పనిచేయకపోవడంతో వైర్‌ను పట్టుకుని సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. జయమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

గెట్టు పంచాయితీ.. పత్తిచేను ధ్వంసం

మర్రిగూడ, జూలై 17: ఇద్దరి మధ్య గెట్టు తగాదాలు రావడంతో ఎకరంన్నర పత్తిచేను ధ్వంసం చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలంలోని లెంకలపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. వరికుప్పల వెంకన్న రెండున్నర ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నాడు. వెంకన్న గెట్టు దాటి తన భూమి దున్నాడని అదే గ్రామానికి చెందిన గుండెపుని బిక్షమయ్య మంగళవారం రాత్రి వెంకన్నకు చెందిన పత్తి చేను ధ్వంసం చేశాడు. బిక్షమయ్యపై చర్యలు తీసుకోవాలని వెంకన్న బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

కొత్తతండాలో 10 లీటర్ల సారా స్వాధీనం

మఠంపల్లి, జూలై 17: సారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ. నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తతండాకు చెందిన బానోతు రవీందర్ తండా నుంచి మఠంపల్లికి బైక్ సారా తరలిస్తున్నారనే సమాచారంతో మండలకేంద్రం సమీపంలో 10లీటర్ల సారా, బైక్ సీజ్ చేసి అతని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి, పోలీసులు నాగరాజు, రవికుమార్, రుక్మారెడ్డి, గోపిరెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

మోసం చేసిన నిర్వాహకుడు, ఏజెంట్లపై కేసు

చింతపల్లి, జూలై 17: డబుల్ ధమాకా పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామానికి చెందిన మదిని మనీష్‌రెడ్డి మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)లో మనీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడర్స్ పేరిట నాలుగు సంవత్సరాల క్రితం ఓ సంస్థను ప్రారంభించాడు. పది మంది ఏజెంట్లను నియమించుకున్నాడు. స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయని, ఎంత పెట్టుబడి పెడితే అంత మొత్తం కొద్ది రోజుల్లోనే వస్తుందని ఆశ చూపాడు. ఏడాది వరకు తక్కువ మొత్తంలో పెట్టుబడి వారికి అందరికీ డబుల్ మొత్తాన్ని అందజేసి అందరికీ ఆశ కల్పించాడు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి, యాచారం, మర్రిగూడ, నాంపల్లి, హైదరాబాద్, చౌటుప్పల్, నిజామాబాద్, కరీంనగర్, వనస్థలీపురం, ఇబ్రహీంపట్నం, తుర్కయాంజల్ ప్రాంతాల్లో ఏజెంట్ల ద్వారా 200 మంది నుంచి రూ. 50కోట్లు మేరకు వసూలు చేశాడు. సంవత్సరాలు అవుతున్నా తమ డబ్బులు ఇవ్వమని కోరుతున్నా రేపు, మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నాడు. అధిక వడ్డీ ఆశ చూపించి డబ్బులు ఇస్తానని ఇవ్వకుండా మోసం చేస్తూ కాలయాపన చేసేవాడు. చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామానికి బండి శివ మనీష్‌రెడ్డి ఏడాది క్రితం సుమారు రూ.6 లక్షలు ఇచ్చాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో మనీష్‌రెడ్డిపై చింతపల్లి పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు మనీష్‌రెడ్డి, అతనికి సహకరించిన అదే గ్రామానికి చెందిన వీరమళ్ల మహేష్, గాదగోని సందీప్‌లను అరెస్టు చేశారు. వారిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు

● రూ.18.45లక్షల విలువైన 74 కిలోల గంజాయి, కారు, ఐదు ఫోన్లు స్వాధీనం ● డిక్కీలో కనిపించకుండా ప్రత్యేకంగా ఫ్రేమ్



నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, గంజాయి

నల్లగొండ క్రైం, జూలై 17: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉండగా వారి నుంచి రూ.18,45,625తో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కొలను శివరాంరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు జిల్లాలో డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీన విజయవాడ-హైదరాబాద్ రహదారిపై కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద శాలిగౌరారం సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, కేతెపల్లి ఎస్ఐ రవితేజ, సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు మహేందర్, మహేష్ తమ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కారు(యూపీ 19 జే 0018) అనుమానాస్పదంగా వస్తుండడంతో ఆపి తనిఖీ చేసినట్లు తెలిపారు. కారులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గౌతమ్ బుద్ధ్‌నగర్, గ్రేటర్ నోయిడా గమ్మ 2కు చెందిన అశోక్‌కుమార్, యూపీలోని మొరదాబాద్‌హార్తల గంగ మందిర్‌కు చెందిన దీపుకుమార్ అలియాస్ వాసు ప్రజాపతి, ఢిల్లీ మండవళి నంబర్-3, లక్ష్మీనగర్‌కు చెందిన సుష్మారాయ్‌లను అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రేమ్‌సింగ్ సూచనల ప్రకారం ప్రేమ్‌సింగ్ కారులో ఒడిశాలోని కలిమెల మల్కాన్‌గిరికి వెళ్లి అక్కడ సుశాంత్ బడాయి అనే వ్యక్తి దగ్గర నుంచి 89 ప్యాకెట్లలో గంజాయిని కొనుగోలు చేసి ప్రేమ్‌సింగ్‌కు గంజాయిని డెలివరీ చేసేందుకు వెళ్తున్నట్లు అంగీకరించారన్నారు.

డిక్కీలో కనిపించకుండా ప్రత్యేకంగా ఫ్రేమ్

కారు వెనుక డిక్కీలో కనిపించకుండా ఒక ఫ్రేమ్‌ను ప్రత్యేకంగా తయారు చేయించి అందులో తరలిస్తున్న రూ.18,45,625 విలువ కలిగిన 73.825 కిలోల(89 ప్యాకెట్లు) గంజాయిని, యూపీ 19 జే 0018 నెంబర్ గల కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మురాదాబాద్ కుచవలికి చెందిన ప్రేమ్‌సింగ్, గంజాయి సరఫరా చేస్తున్న ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి కలిమెల మల్కాన్‌గిరికి చెందిన సుశాంత్ బడాయి పరారీలో ఉన్నాడని, గంజాయి రవాణా చేసినందుకు వీరికి ఒక్కొక్కరికి రూ.20వేలు ప్రేమ్‌సింగ్ ఇస్తుంటాడని తెలిపారు.

గంజాయి, డ్రగ్స్‌పై సమాచారం ఇవ్వాలి

నల్లగొండ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగంపై పోలీసులకు సమాచారం అందించాలని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. కొంతమంది యువత గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల మత్తులో పడి బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారి వివరాలను, మాదక ద్రవ్యాల వినియోగంపై డయల్ 100కు కానీ, సంబంధిత పోలీసులకు కానీ సమాచారం ఇవ్వాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రస్తుతం మారిన చట్టాలతో కేసులు నమోదైతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. గంజాయి పట్టుకున్న శాలిగౌరారం సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐలు మహేందర్, మహేష్, సిబ్బంది ప్రభాకర్, కొండల్, లక్ష్మీప్రసాద్, శ్రీను, లింగరాజు, గిరిలను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించినట్లు డీఎస్పీ శివరాం రెడ్డి తెలిపారు.



భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

భక్తులతో ఆలయాల రద్దీ


బూరుగడ్డ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట అర్బన్, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం జిల్లాలోని ఆలయాల్లో భక్తిశ్రద్ధతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో రద్దీ నెలకొంది. జిల్లా కేంద్రంలోని దేవాలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు, ఉత్సవ విగ్రహాలకు అర్చకులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాల ఎదుట మహిళా భక్తులు వేకువ జాము నుంచే బారులు తీరారు. భగవన్నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి.

పెన్‌పహాడ్: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు వేకువజామున దేవాలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు. మండలంలో భక్తుల సందడి కనిపించింది.

హుజూర్‌నగర్: పట్టణంలోని అన్ని దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. బూరుగడ్డ వేణుగోపాలస్వామి దేవాలయంలో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కొండయ్య, రంగభట్రాచార్యులు, రెంటాల రవిశర్మ, ఈవో కొండారెడ్డి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన దండరామాలయంలో వేద పండితుడు శ్రీలక్ష్మీనర్సింహాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమప్ప దేవాలయంలో చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అన్ని దేవాలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: తొలి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజల అనంతరం 24గంట ఏకనామ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, రంగభట్టాచార్యులు, సైదిరెడ్డి, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి ఆలయంలో స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.


మట్టపల్లి దేవాలయంలో బారులు తీరిన భక్తులు

కోదాడ రూరల్: తమ్మరలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం, అనంతగిరిలోని కోదండరామస్వామి దేవాలయం, గుడిబండలోని రామాలయం, గణపవరంలోని వరవర రంగనాయకస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ సమీపంలో అఖండ జ్యోతిస్వరూప సూర్యనారాయణ క్షేత్రంలో, అర్వపల్లి యోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో రాంబాబు, పవన్, రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.









త్యాగానికి ప్రతీక మొహర్రం పండుగ


చిలుకూరులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

సూర్యాపేట అర్బన్, జూలై 17: త్యాగానికి ప్రతీక మొహర్రం పండుగ అని పలువురు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పీర్లను ఊరేగిస్తూ మొహర్రం పండుగను కుల, మతాలకు అతీతంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో తొమ్మిది రోజుల క్రితం ఏర్పాటు చేసిన పీర్లను డప్పు వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ పీర్ల చావిడిలో ప్రతిష్ఠించారు. చిన్నారులు, యువకులు నృత్యాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు. ప్రజలు పీర్లకు మొక్కులు చెల్లించారు. అనంతరం స్థానిక ఈశ్వర్ మూవీ మహల్ థియేటర్ వద్ద పీర్ల సవారీలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ముజావర్లు, భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రంతో పాటు గానుగుబండ గ్రామంలో పీర్ల పండుగను వైభవంగా నిర్వహించారు పీర్ల చావిడిలో ముజావర్ ప్రార్థనలు చేశారు. దువా అనంతరం ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీర్లకు భక్తులు మొక్కులు చెల్లించారు.

పెన్‌పహాడ్, చిలుకూరు: పెన్‌పహాడ్, చిలుకూరు మండలాల్లోని అన్ని గ్రామాల్లో మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు రకరకాల వేషధారణతో పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వేషధారణలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

మఠంపల్లి: హుస్సేన్ వీరోచిత పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ చేసుకునే పండుగ మొహర్రం అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండా బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో గ్రామంలో నిర్వహించిన పీర్ల పండుగ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వగ్రామంలో జరుగుతున్న వేడుకల్లో పాల్గొడం సంతోషంగా ఉందన్నారు. . ప్రజలు పీర్లకు మొక్కులు చెల్లించారు.

చిలుకూరు: మొహర్రం పండుగను మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వె

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం, వేల్పుర్ల గ్రామాల్లో మొహర్రం పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ గ్రామంలో కులమతాలకు అతీతంగా మొహర్రం పండుగను నిర్వహించారు. గ్రామంలో పీర్లను ఎత్తుకుని ఇంటింటికీ తిరుగగా, మహిళలు కుడకలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు వివిధ వేషధారణలతో ప్రజలను అలరించారు.

నాగారం: మొహర్రం వేడుకలను నాగారం మండల కేంద్రంతో పాటు పసునూరు, వస్త్రాల, శాంతినగర్, డి.కొత్తపల్లి, ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నృత్యం చేస్తూ పీర్లనే ఊరేగించారు. భక్తులు పీర్లకు కుడకడలు, దట్టీల కట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం పీర్లను కర్బలాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వడ్లకొండ వెంకన్న, లింగయ్య, యల్లయ్య, అక్బర్, బాషా తదితరులు పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ మండలం తొండ గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



CLASSIFIEDS

282 గజాల ప్లాట్ అమ్మబడును

★ నల్లగొండ నుండి మిర్యాలగూడ రోడ్, కలెక్టరేట్ దగ్గర, డైట్ కాలేజి ఎదురుగా 282 గజాల కమర్షియల్ ప్లాట్ అమ్మబడును. సంప్రదించండి సెల్: 9912738000, 7780727743

AJY_161863

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9177572576

యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడుకోవాలి

హుజూర్‌నగర్ రూరల్, జూలై 17: యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడుకోవడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమని ఎస్ఐ ముత్తయ్య, స్వామి వివేకానంద విగ్రహ కమిటీ అధ్యక్షుడు పశ్య శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కళాశాలల్లో యువత కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. యువతీ, యువకులు, విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దన్నారు. కష్టపడి చదివితల్లిదండ్రుల ఆశయాలు నేరవేర్చాలన్నారు. నిరుపేద, అనాథ విద్యార్థులను ఆదుకోవాలన్నారు. అవినీతిపై పోరాటం చేయాలన్నారు. నిజాయితీ అధికారి ఉమేష్‌చంద్ర పేరిట ఫౌండేషన్ ఏర్పాటుచేయడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో యూసీఎఫ్ ఫౌండర్ తన్నీరు ఉమేష్, ముల్కలపల్లి రాంబాబు, రవీందర్, కనకాంబరం, సులువ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

గోరింటాకు సంబురాలు

మఠంపల్లి, జూలై 17: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం మఠంపల్లి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రెడ్డి పరివార్ ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని గోరింటాకు సంబురాలు నిర్వహించుకోవడం సంప్రదాయమని అన్నారు.

నాగారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి బదిలీ

నాగారం, జూలై 17: నాగారం ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డిని నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌కు ఎస్పీ బదిలీ చేశారు. నాగారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఏఎస్ఐ వెంకట్‌రాములుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నాగారం ఎస్ఐగా వెంకట్‌రెడ్డి నాలుగు నెలలే బాధ్యతలు నిర్వహించారు. బదిలీపై వెళతున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డిని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఏఎస్ఐ వెంకటరాములు, కానిస్టేబుళ్లు ఎల్లయ్య, రవీందర్, నారాయణరెడ్డి, వీరన్న సన్మానించారు.

వ్యక్తి మృతితో పండుగ పూట విషాదం

అనంతగిరి, జూలై 17: కుటుంబ యజమాని మృతితో మొహర్రం పండుగ రోజు ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాలారం ఆవాసం రంగయ్యగూడెం గ్రామానికి చెందిన షేక్ లాల్‌సాబ్(37) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూటి మాదిరిగానే ఉద్యోగానికి వెళ్లగా, ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి వెళ్లాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. లాల్‌సాబ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కండువాలు కప్పుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి


సూర్యాపేట టౌన్, జూలై 17: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌజ్‌లో జిల్లా కేంద్రంలోని 10వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పందిరి మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ మాలి అనంతరెడ్డితో పాటు కుప్పిరెడ్డిగూడెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. పంట రుణాల మాఫీతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, మాలి అనంతరెడ్డి, పందిరి మల్లేష్, బీరవోలు రవీందర్‌రెడ్డి, రామసాని శ్రీనివాసనాయుడు, కోతి గోపాల్‌రెడ్డి ఆదిమల్ల కృష్ణ, కనుకు వెంకన్న, కట్టె నరేష్, జానయ్య, సురేష్, సతీష్, నగేష్, శ్రీను, నాగరాజు, నాగయ్య, పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న వెంకట్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, జూలై 17: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త మారం వెంకట్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిర ఆర్ట్ ఫౌండేషన్, ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన వార్షికోత్సవంలో వెంకట్‌రెడ్డికి డాక్టరేట్‌ను ప్రొఫెసర్లు పీవీపీ అంజనీకుమారి,చింతకుంట రాంమాణిక్‌రావు అందజేశారు. సామాజిక సేవకు వెంకట్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది.





సూర్యాపేట అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో సిబ్బందితో పాటు మందులను రోగులకు అందుబాటులో ఉంచాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ కోరారు. ఈ మేకు బుధవారం జిల్లా కేంద్రంలోని గిరినగర్ పీహెచ్‌సీలో ఇన్‌చార్జి డాక్టర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూరం రేణుక, జయమ్మ, వాజిద్ పాల్గొన్నారు.

చివ్వెంల: హైదరాబాద్‌కు చెందిన కంచి కామకోటి పీఠానికి చెందిన శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో దురాజ్‌పల్లి సమీపంలోని వివేకానంద ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆశ్రమ నిర్వాహకుడు సవరాల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్గనైజర్ బాలరాజు, డాక్టర్లు వేదిక, పార్వతి, సందీప్, కృష్ణమూర్తి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌ఫామ్ తోటలు సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని సూర్యాపేట డివిజన్ ప్రాంతీయ ఉద్యానవన అధికారి కన్న జగన్ అన్నారు. ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా బుధవారం పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో రైతు దీపా కుమారి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌ఫామ్‌మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జె.హరీష్, శశికుమార్, లక్ష్మీనారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని మంత్రి ఉత్తమ్ క్యాంప్ కార్యాలయంలో రూ.3 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరారెడ్డి, చంద్రశేఖర్, భిక్షం, నాగయ్య, గురవయ్య, వెంకన్న, నాగరాజు, అజ్మతుల్లా, నర్సింహారావు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆగస్టు 17, 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొణతం కృష్ణారెడ్డి తెలిపారు. ప్రతిష్ఠించే దేవతామూర్తుల విగ్రహాలు కుంభకోణం నుంచి రావడంతో నేరేడుచర్లలో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు.

హుజూర్‌నగర్, నేరేడుచర్ల: అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ చిలకబత్తిని సౌజన్య అన్నారు. 'అమ్మమాట..అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గోవిందాపురం, దీక్షితన్‌నగర్, అనుములగూడెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాంత, జీవమ్మ, మాలతి, తిరుపతమ్మ, సునీత, రజని, పాల్గొన్నారు.

● పిల్లల వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగపడతాయని నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలో ఐదో అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ర్యాలీలో సునీత, పుష్పమ్మ, బుచ్చమ్మ, పాపారావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ఆశాకార్యకర్తలు నాగన్నకు పట్టణంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, గురవయ్య, సీత, సుశీల, జానకి, లక్ష్మి పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని తమ్మర గ్రామంలోని షిర్డీ సాయిబాబా దేవాలయాన్ని గురుపౌర్ణమి వేడుకలను ముస్తాబు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు కమతం రాము తెలిపారు.

కోదాడ రూరల్, చిలుకూరు, చివ్వెంల, నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పత్రాల పంపిణీ వేడుకలను కోదాడ మండలంలోని కాపుగల్లు రైతు వేదికలో, అనంతగిరి మండలంలోని త్రిపురవరం రైతు వేదికలో, చిలుకూరు, మునగాల, నడిగూడెం, చివ్వెంల నాగారం మండల కేంద్రాల్లో గురువారం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో సీహెచ్ సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ చివ్వెంల మండల అధ్యక్షుడు వీరన్ననాయక్, నాగారం ఏవో తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మునగాల రూరల్: పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సామాజిక కార్యకర్త గంధం సైదులు ఒక ప్రకటనలో కోరారు.

తుంగతుర్తి: వీధి కుక్కల, కోతుల బెడద నుంచి ప్రభుత్వం ప్రజలను కాపాడాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని బికుమళ్ల గ్రామా తాజా మాజీ సర్పంచ్ బొల్లేపల్లి అశోక్ తండ్రి శ్రీరంగం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. శ్రీరంగం మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో తాజా మాజీ ఎంపీపీ భూరెడ్డి కళావతి, దరిపెల్లి వీరన్న, పసుల అశోక్‌యాదవ్, రమ, ప్రశాంత్‌రెడ్డి, భద్రి ఉన్నారు.